

# యమభాగోతం!

ఇప్పుడంటే సరదాలన్నీ చచ్చి వూరుకున్న విగాని, చిన్నప్పుడు నాటకాలన్నా, వీధి భాగోతాలన్నా, తోలుబొమ్మలాట లన్నా నాకు మహా సరదాగా వుండేది. మహా సరదా ఏమిటి, యమ సరదా అంటే నమ్మండి! మా వూళ్లో వేసిన వీధి భాగోతా లను చూసి మాత్రమే ఆనందించేవాణ్ని; నాటకాలు,తోలుబొమ్మలాటల విషయంలో మాత్రం అలా కాదు. పలుగు తోటిపిల్లలనూ కూడ దీసి ఏదో ఒక నాటకం స్వయంగా ఆడితేనేగాని సరదా తీరేది కాదు; పుస్తకాల మీది అట్టలు, లోపలి కాగితాలు అన్నీ చించి వాటిమీద పంచపాండవులుగా, రాక్షసులుగా ఏవేవో బొమ్మలువేసి కత్తిరించి ప్రమిదదీపాల వెలుతురులో తెరమీది కెక్కించి ఆడిస్తేనేగాని మనసు తీరేది కాదు. వెధవ అట్టబొమ్మలు, కాగితపు బొమ్మలు ఆడిస్తే మజా? ఏముంది—ఆడిస్తే అసలు తోలుబొమ్మలే ఆడించాలని ఒకసారి బుద్ధిపుట్టి - మా పెదనాన్నగారి దేవతార్చన సంచి జింకచర్మం కోస్తా బదాబదలుగా కత్తిరించేసి, వాటికి నాగజెముడు గుబ్బల్లోపలి ఎర్రరంగూ, కరక్కాయసిరా నల్లరంగూ పూసి తెరమీదికెక్కించేసరికి స్నేహితులందరూ దంగైపోయారు! దేవతార్చన సంచి ధ్వంసమైపోయినందుకు మా పెద్దనాన్న ఉగ్రుడై మీదపడేసరికి బారెత్తి పరిగెత్తవలసి వచ్చిందనుకోండి! అది వేరే విషయం.

ఇలాగే ఒకసారి నేనూ,నా స్నేహితులూ కలిసి లంకాదహనం నాటకం వేయబోయి, అదేమిటేమని స్టేజి అమర్చిన పందిరి దహనమే చేసివేశాము — నాటకం ప్రత్యక్ష రామాయణ ప్రదర్శనంగా తయారైంది!

* * *

నాటకమంటే జ్ఞాపకమొచ్చింది. ఆనాటి మిత్రులలో ఒకడు నాలుగుగోడల మధ్యనా కూచోపెట్టి పాడరా అంటే,మహా హాయిగా పాడేవాడు. అయితే వచ్చె సభాపిరికి. ఒకసారి వాడిచేత ఎలాగైనా వేషం వేయించాలిసిందేనని పట్టు పట్టాము. ఏమనుకొన్నాడో సరేనన్నాడు. వేషం తీర్చి దిద్దుకున్నాడు. నాటకం మధ్యలో వాడిపాత్ర ప్రవేశించాలిసిన సమయం వచ్చింది. వచ్చినా సైడ్‌వింగులో నుంచి స్టేజిమీదికి

శ్రీ

వూడిపడితే! బాబూ! వెళ్ళి అనాలుగు ముక్కలూ అని, ఆ పద్యంపాడి రారా అని కాళ్ళూగడ్డమూ పట్టుకుని ఎంత బతిమాలినా కదలనే కదలడే! ఇకలాభం లేదనుకొని వాడి వెనకాలే మరో ఇద్దరం నిలుచుని స్టేజి మీదికి ఒక్కతోపుతోశాం! ఏం లాభం! ఇటునుంచి తోశామో లేదో, ఎదురుగావున్న రెండో సైడ్‌వింగ్‌లోకి తుర్రున దూర బడ్డాడు! అక్కడవున్న ఇద్దరు మిత్రులు వాడిమొహం మాకేసితిప్పి స్టేజిమీదికి మరో తోపుతోశారు! ఇహ ఎటు పోవడానికి గత్యంతరంలేక, వింత వేషంతోనే గబగబా స్టేజి దూకి వెళ్ళి ప్రేక్షకులు కూర్చున్నచోట ఒక ఖాళీసీటుంటే దానిమీద హాయిగా చతికిలబడ్డాడు!

అంతటితో ఆరాత్రి నాటకానికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. ఆతర్వాత గింజుకున్నా వాడికి మా నాటకాల్లో పాత్ర ఇవ్వలేదు.

* * *

మరోసారి మరో గమ్మత్తు జరిగింది! మరో గమ్మత్తేమిటి బ్రహ్మాండమైన గమ్మత్తు! జన్మలో మరిచిపోలేని గమ్మత్తు.

వీధి నాటకాలంటే మహా చెడ్డసరదా అని చెప్పాను కదూ!

హైస్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో ఆచిన్న పట్నానికి వీధి భాగోతుల సెట్టు ఒక్కటి వచ్చింది. వరసగా రోజు మార్చి రోజు నడిబజారులో ఆటలు వేసు న్నారు. వాటిదుంపతెగ! వీధిభాగోతాలంటే సామాన్యమా? రాత్రి పదకొండింటికి మొదలుపెడితే, తెల్లగా తెల్లవారేవరకూ, ఒక్కొక్కప్పుడు సూర్యోదయమయాక కూడా ఆడాలిసిందేనయ్యా! వాటిమీద వుండే సరదా కొద్దీ వరస తప్పకుండా చూడడం మొదలుపెట్టా. అప్పటికి సతీ అనసూయ, భక్త సిరియాళ మొదలైన ఆటలు ఆడేశారు. ఆనాటిరాత్రి సతీసావిత్రి ఆడడానికి సన్నాహం చేశారు. సతీసావిత్రి కథ అంటే అప్పట్లో నాకు బహుఇష్టమేమో, పూర పొద్దుగూకకముందే, రెండు మెతుకులు తిని వెళ్ళి భాగోతుల పాదధూళితో పావన మయ్యేలా వాళ్ళదగ్గిరే కూచున్నా. ఆనాడు ఏకారణంచేతనైనా భాగోతులు ఆ సావిత్రి ఆటఆడకపోతే ఎంత ఆశాభంగం చెందే వాణ్నో చెప్పలేను. చివరకు అంత ప్రమాదమూ జరిగేపరిస్థితి ఏర్పడి కొద్దిలో తప్పిపోయింది!

భాగోతుల సెట్టులో యముడివేషం వేసే వాడి తండ్రికి హఠాత్తుగా ప్రాణం మీదికి వచ్చిందని కబురువస్తే, అతగాడు వూరికి వెళ్ళిపోవడం జరిగింది.

అయినా ఆటజరిగి తీరాలిసిందేనని పెద్ద లందరూ పట్టుపట్టినందువల్ల, వీధిభాగోతాల్లోనూ నాటకాల్లోనూ వేషాలు వేయాలని ఉబలాటపడే ఒడ్డూ పొడుగూ వున్న ఒక పెద్ద లావుపాటి ఆయనచేత యముడి వేషం వేయించడానికి ఏర్పాటుచేశారు.

యముడు వేషంవేసే మహదవకాశం దొరికినందుకు ఆయన ఎంత ఉబ్బితబ్బిబ్బై పోయాడో! ఆరాత్రికి భోజనం మానేశాడు. చారెడు మిరియాలు, లవంగాలు పసపస నమిలి మింగి; కంఠం మరమ్మతు చేసు కున్నాడు. పొద్దుగూకే సరికల్లా భాగోతులు రంగులు పూసుకునే విడిది ఇంటికి చేరాడు. ఆరోజుల్లో రంగులేమున్నవి? అద్దకం ముద్ద లేగా? మొహానికీ, చేతులకూ, కాళ్ళకూ,

(53-వ పేజీ చూడండి)

# యమభాగోతం!

(6-వ పేజీ తరువాయి)

ఛాతీకీ, నడుముకూ ఇంత నీలిరంగు అద్దకం దట్టంగా పట్టించేసుకున్నాడు. యముడి వేషానికి తగినట్టుగా బుర్రమీసాలు అంటించుకున్నాడు. అద్దంలో చూసుకుని తన మూర్తికి తానే మురిసిపోయాడు. ఎప్పుడెప్పుడు రంగంమీదికి వస్తామా అని ఆదుర్దా పడసాగాడు.

సావిత్రి నాటకంలో, దాని దుంప తెగ, యముడివేషం ఒక పట్టాన రంగం మీదికి వస్తుందా? ఎంత కథ నడవాలి! ఎంత కమామిషు!

భాగోతం సాగిపోతున్నది. రాత్రి పన్నెండయింది: ఒంటిగంట అయింది! ఊహుఁ. యముడువచ్చేఘట్టం ఇంకా రాలేదు. అసలు సంధ్యవేళే ఒంటంగుళం మందాన అద్దకం పట్టించాడేమో, కొత్తయముడి ఒళ్లు కారంపూసినట్లు భగ భగా మండిపోతున్నది! ఆ మంటలు భరించ శక్యం కాకుండా ఎక్కువైపోతున్నవి, పాపం! ఎప్పుడెప్పుడు వేషం విప్పేసి ఊరిబయటవున్న చెరువులో పడదామా అన్నంత విసుగుపుట్టుకొచ్చింది అతగాడికి.

అప్పటికి తెల్లవారగట్ల దాదాపు మూడు గంటలై వుంటుంది. సిగ్నల్ ఇచ్చారు. ఇక యముడు ప్రవేశించవచ్చునన్నారు.

తెగ బలిసిన నల్లటి దున్నమీద ఎక్కి, ఒకచేత్తో గదా, మరొకచేత్తో పాశం ధరించి, బుర్రమీసం తిప్పుకుంటూ, దహించుకు పోతున్న వంటిబాధను దిగమింగుతూ సాక్షాత్తూ యమలోకంనుంచి ఊడిపడి నట్లుగా రంగం స్థలంమీద యముడు సాక్షాత్కరించాడు!

ఇటు ప్రేక్షకులవేపు ఒకసారి, అటు పక్కనే పెనిమిటిని పెట్టుకునివున్న సావిత్రి వేపు ఒకసారి చింతనిప్పులు రాలుస్తున్న ఆ కళ్లతో అతి భయంకరంగా చూశాడు; చూసి నిశ్శబ్దంగా నిలుచుని పోయాడు. ఎంతసేపటికీ మాటా మంతీ లేని ఆ యముణ్ణి సంభాషణలోకి దించడానికి సావిత్రి:

"మహానుభావా! ఎవరు మీరు?" అని ప్రశ్నించింది.

"నేనా! తెలియదా? గాబకొండ వెంకటప్పయ్యను!" అన్నాడు, ప్రేక్షకుల గుండెలు దద్దరిల్లిపోయేట్టు. రెండోసారైనా మాట తిప్పుకుంటాడేమోనని సావిత్రి:

"మహానుభావా! తాము వచ్చిన కారణం?" అన్నది.

"బుద్ధి గడ్డితినివచ్చా," అని అనేసి ఆ యముడు చెరువువేపు ఆనేపరుగు! దానితో ప్రేక్షకజనం గొల్లుమన్నది! వీథిభాగోతం యమ భాగోతంగా మారిపోయింది! ★







ప్రభూ! దివ్యతేజోమయా! నీ
పవిత్ర కాంతి కిరణ ప్రసారముచే
దురంత విషాదాంధ తమస్సులో
దురపిల్లెడి నికృష్ట మానవ హృదయాలను వెలిగించి
భయ సందేహాలను, ద్వేషద్వేష్యాలను పారద్రోలి
పావన శాంతి, సత్య, సౌఖ్యమార్గాన్ని చూపించుటకు
పరిశుద్ధమైన ఆహారం మానవులకు ముఖ్యావశ్యకం —
పరిశుద్ధమైన ఆహారం అంటే, శుచీ
శుభ్రతే కాక, రుచి, హితకరమైన సువాసనలతో
కూడుకొని ఉండాలి —
అటి రుచికరమైన, హితకరమైన ఆహారపదార్థములకు
60 ఏళ్లుగ ప్రసిద్ధి చెందిన

**L. G.** ఎల్. జీ. ఇంగువనే వాడండి

నాణ్యమునకు, సరసమైన ధరకు ప్రఖ్యాతి చెందినది
ప్రతిచోటా దొరకును.

**లాల్ జీ గోధు అండ్ కో.,**

సౌకార్ పేట, మద్రాసు-1.

హెడ్డాఫీసు: బొంబాయి.